
# అమ్మ శతకం





-హెచ్. ఆర్. చంద్రం
సెల్: 9493248053

నన్ను గన్న తల్లి అన్నపూర్ణమ్మ,మా
అమ్మ కిడుదు వందనమ్ము ముందు;
వందనీయ లగుదు రందరు నమ్మలు,
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ గూర్చి శతక మనుకొనగానె మా
అమ్మ యెదుట నిలిచినట్టు లాయె!
అందుకొంటి నట్టు లమ్మ దీవెనలను!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ పైన కవిత లల్లియుంటిని తొల్లి,
సంతరింతు 'నమ్మ శతక' మిపుడు;
అమ్మ గూర్చి వ్రాయు టొగదా సుకృతము!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఆటవెలదులందు ,తేటతెలుగు లోన,
స్పష్టమైన సులభ శైలి వ్రాసి,
అందజేతు పాఠకాళి కీ శతకమ్ము
వందనమ్ము లమ్మ లందరికిని!

'అమ్మ'అన్న మాట అమృతోపమానమౌ,
కాదు కాదు, దానికన్న మిన్న;
ఉండ దమ్మ మాట కుపమాన మన్యము!
వందనమ్ము లమ్మ లందరికిని!

మహిత సూక్తి కాద 'మాతృదేవోభవ!'
ఉపనిషత్తు పలికియుండె నెపుడొ;
యుగయుగాలు నిలుచు నుపనిషద్వాక్యము!
వందనమ్ము లమ్మ లందరికిని!

పుడమిపైన చెడ్డ కొడుకు పుట్టగవచ్చు,
కాని, చెడ్డ తల్లి కానరాదు;
మాతృమూర్తి మదికి మాలిన్య మంటునా?
వందనమ్ము లమ్మ లందరికిని!

అందరికిని ఉందు రమ్మలులోకాన,
జనని మూల మగును జన్మమునకు;
తల్లి కనకయున్న తా నెట్లు పుట్టును?
వందనమ్ము లమ్మ లందరికిని!

పండితుండు గాని,పామరుడును గాని,
పాలితుండు, దేశ పాలకుండు-
ఎవ్వరైన జననియే వారి గనవలె!
వందనమ్ము లమ్మ లందరికిని!

కష్ట మనక తాము కడుపులో నవమాస
ములును మోసి,తుదకు పురిటి నొప్పు
లును భరించి,బిడ్డలను గందు రమ్మలు!
వందనమ్ము లమ్మ లందరికిని!

తాను తినియు తినక, తన బిడ్డలకు పొట్ట
నింద 'బువ్వ' పెట్టుచుండు తల్లి;
తల్లి మారు పేరు త్యాగమ్మునకు గాద!
వందనమ్ము లమ్మ లందరికిని!

తొలి దినాలలోన కలదు మాతృస్వామ్య,
మది క్రమానుగతిని అంతరించె;
వృద్ధి గాంచె నిక పితృస్వామ్య పద్ధతి
వందనమ్ము లమ్మ లందరికిని!

స్త్రీని 'అబల' యనుచు చెప్పుచుందురు నేడు,
కాని, పూర్వ మట్లు కాదటంచు
తెలియజెప్పు కథలు కల వెన్నియేనియు!
వందనమ్ము లమ్మ లందరికిని!

గౌరవముగ తల్లి పేరుతో తమ పేరు
కలిపి చెప్పుకొన్న ఘనులు గలరు;
నరుల నేలినారు,చరితార్థు లైనారు!
వందనమ్ము లమ్మ లందరికిని!
(గౌతమీపుత్ర శాతకర్ణి,మౌర్య చంద్రగుప్తుడు)

వైనతేయ దైత్య దాన వా దిత్యాది
జాతు లమ్మ పేర ఖ్యాత మయ్యె;
మాతృ ఘనత జాటు మన పురాణము లెల్ల!
వందనమ్ము లమ్మ లందరికిని!
(వినత సంతానం వైనతేయులు.దితి సంతానం దైత్యులు.
దనువు సంతానం దానవులు లేదా దనుజులు.
అదితి సంతానం ఆదిత్యులు.)

కన్న సంతు పెంపకమునందు తొలి నాళ్ల
తల్లి కుండు బాధ్యతయె యొకింత
హెచ్చు తండ్రి కన్న, నిది సృష్టి సహజము;
వందనమ్ము లమ్మ లందరికిని!

స్తన్య మిడుటె కాదు, సంతానమును పెంపు
చేయు వేళ అమ్మ చేయు సేవ
లను గణింప తరమె? అనితర సాధ్యాలు!
వందనమ్ము లమ్మ లందరికిని!

బిడ్డ బోసినోట వెలువడు తొలి పిల్పు
అమృతతుల్య మైన 'అమ్మ' కాద?
పిలుపు విన్న తల్లి పులకించి మురియదా?
వందనమ్ము లమ్మ లందరికిని!

కన్న క్షణము నుండి కమ్మనౌ తన బిడ్డ
పిలుపు కొరకు తల్లి వేచియుండు;
బిడ్డ నోటి మొదటి పిల్పు ముచ్చట కదా!
వందనమ్ము లమ్మ లందరికిని!

నవ్వు లాటయా? పునర్జన్మమౌ స్త్రీకి
ప్రసవ, మైన, పండువంటి బిడ్డ
జూచి మరచు తా ప్రసూతి వైరాగ్యము!
వందనమ్ము లమ్మ లందరికిని!

తాగి ముర్రుబాలు రోగనిరోధక
శక్తి పొందును నవజాత శిశువు;
తల్లి ముర్రుబాల వల్ల రక్షణ హెచ్చు,
వందనమ్ము లమ్మ లందరికిని!

ఒడిని బిడ్డ జేర్చి,ఒడికమ్ముగా స్తన్య
మిచ్చి కన్నతల్లి తృప్తి గాంచు;
కన మనోహరమ్ము గాద ఆ దృశ్యమ్ము?
వందనమ్ము లమ్మ లందరికిని!

స్తన్య మిచ్చి తల్లి తాదాత్మ్యమును జెందు,
స్తన్య మాని బిడ్డ సంతసించు;
ఉభయ తారకముగ నుండు కార్య మ్మిది!
వందనమ్ము లమ్మ లందరికిని!

ప్రసవమైన,పాలు పడని తల్లులు నుందు,
రది కడు దురదృష్ట మనగవలయు;
స్తన్య మీయకున్న తల్లి కుండున తృప్తి?
వందనమ్ము లమ్మ లందరికిని!

అర్థ మెరుగకున్న ,హాయిగా నిదురించు
గుర్తుపట్టి తల్లి గొంతు శిశువు;
అమ్మ జోలపాట ఆంతర్య మిదె కదా!
వందనమ్ము లమ్మ లందరికిని!

చంక నెక్కుకొనుట,జాబిల్లి జూపుట,
ముద్దుచేసి గోరుముద్ద లిడుట-
చిన్ననాట అమ్మ చేయు ముచ్చట లివ్వి!
వందనమ్ము లమ్మ లందరికిని!

పసితనమున తల్లిపాలు తాగనివారు,
అమ్మ ఒడికి దూరమైన వారు
'గొప్ప' అనుభవములు కోల్పోయినట్టులే!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఆస్తు లుండవచ్చు,అభిమానమును జూపు
వారు,వసతు లుండవచ్చు, నైన
అమ్మ లేని లోటు నవి తీర్చజాలవు!
వందనమ్ము లమ్మ లందరికిని!

'అమ్మ'యన్న మాట అప్రయత్నముగ వె
ల్వడును నోట, చిన్న బాధ కలుగ;
అమ్మ పదములోన ఆశ్వాస ముండును!
వందనమ్ము లమ్మ లందరికిని!
(ఆశ్వాసము=ఊరట,ఓదార్పు)

'అమ్మ'అనుట నేడు అపచారమైపోయె,
'మమ్మి', 'మామ్' సరైన మాట లంట!
ఏమి చెప్పవలయు నింగ్లీషు లీలలు?
వందనమ్ము లమ్మ లందరికిని!

'అమ్మ'అనునుగాని,'మమ్మీ' అనున యెవ్వ
రైన బాధ కలుగునట్టి వేళ?
అమ్మ పదములోని ఆత్మీయత గనరొ?
వందనమ్ము లమ్మ లందరికిని!

పెంచి, కన్నతల్లి మించి పేర్వడసిన
పుణ్యశీల లున్న పుడమి మనది;
తొలుత గుర్తువచ్చు నల యశోదాదేవి!
వందనమ్ము లమ్మ లందరికిని!

ప్రచుర సూక్తి కలదు-పదిమంది తండ్రుల
పెట్టు తల్లి యనుచు, నిట్టి వెల్ల
పుట్టు ననుభవాల బట్టియే లోకాన;
వందనమ్ము లమ్మ లందరికిని!

దుష్టుడైన మగనితో కాపురము సేయు,
సంతు మేలుగోరి సహన మూని;
తల్లి గుణమునందు త్యాగభాగము హెచ్చు!
వందనమ్ము లమ్మ లందరికిని!

'అమ్మ గుణము' పశువులందును, పక్షుల
లోను స్పష్టరీతి గానబడును;
'పెంటి'చూచుకొనును పిల్లల పోషణ!
వందనమ్ము లమ్మ లందరికిని!

గుడ్లు పెట్టుట, పొదుగుట, పిల్లలకు గూడు
విడుచు వరకు మేత పెట్టుటయును
అండజములలోన'అమ్మ' కర్తవ్యాలె!
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లి పిట్ట బాధ్యతాయుతమ్ముగ మేత
నోట గరచి తెచ్చి పూట పూట
గూటి నున్న పిల్ల నోటి కందించదా?
వందనమ్ము లమ్మ లందరికిని!

కోడి పిల్ల కైన,కుక్క పిల్లకు నైన
హాని సుంత జరిగెనేని వాని
తల్లు లూరుకొనక తగు రీతి స్పందించు!
వందనమ్ము లమ్మ లందరికిని!

క్షీరదములు పాలు చేపి చన్నుడుపును,
అండజములు మేత నందజేయు;
ఇందు నందు తల్లిదే ముఖ్యపాత్ర యౌ!
వందనమ్ము లమ్మ లందరికిని!

తాగుబోతు మగడు తనను బిడ్డలను పో
షించ, డిల్లు గుల్లచేయు గాని;
కూలిచేసి పెంచుకొనును పిల్లల తల్లి!
వందనమ్ము లమ్మ లందరికిని!రి

ఓర్పు గల్గు తల్లు లుందు రందందు, బి
డ్డలనె కాదు తమ మగలను గూడ
బిడ్డలుగ దలంచి పెంచి పోషింతురు!
వందనమ్ము లమ్మ లందరికిని!

'అమ్మవారి'లోన అమ్మ తత్త్వము గాంచు,
తనను బిడ్డవోలె తలచుచుండు;
భక్తులందు నిట్టి 'భావ చిత్రము'లుండు!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఆడువార లెల్ల అమ్మలు కాజాల,
రమ్మతనము సర్వసమ్మతమ్ము;
అమ్మ కందు గౌరవమ్ము సామాన్యమా?
వందనమ్ము లమ్మ లందరికిని!

ఎంత ఆస్తి యున్న,ఎన్ని యోగ్యత లున్న,
మగువ కోరుకొనును 'మాతృపదము';
మాతృమూర్తి గాక మగువ తృప్తిపడదు,
వందనమ్ము లమ్మ లందరికిని!

కడుపు పండి ఒక్క కాయ కాచిన మాతృ
పదవి దక్కు, గౌరవమ్ము దక్కు;
ఆదరమ్ము తగ్గు నతివ గొడ్రాలైన!
వందనమ్ము లమ్మ లందరికిని!

నాగరికుల కిపుడు నచ్చుకున్నది గాని,
స్త్రీల పేరు చివర చేరియుండు
'అమ్మ' పొందె గౌరవమ్ము గతమ్మున!
వందనమ్ము లమ్మ లందరికిని!
(సీతమ్మ,లక్ష్మమ్మ,సుబ్బమ్మ -మొ?)

భర్తపైన నుండు భక్తి యెంతేనియు,
బిడ్డపైన నుండు పిచ్చిప్రేమ;
అమ్మ ప్రేమ మించు నర్ధాంగి భక్తిని!
వందనమ్ము లమ్మ లందరికిని!

బిడ్డపైని తల్లిప్రేమకు కొలబద్ద
లుండబోవు, హద్దు లుండబోవు;
అవసరమును బట్టి అది హెచ్చు, తగ్గును,
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లి బిడ్డ యెదుగుదల కోరు నెల్లప్పు,
దందుకై శ్రమించు నహరహమ్ము;
తనకు సాధ్యపడిన పనులెల్ల చేయును!
వందనమ్ము లమ్మ లందరికిని!

బిడ్డ యెదుగుదలకు అడ్డు తగిలిన, భ
ర్తను క్షమించలేదు తల్లి మనసు;
వేడును,బతిమాలు,వినకున్న నెదిరించు!
వందనమ్ము లమ్మ లందరికిని!

కన్నబిడ్డ పైన కక్ష వహించదు
బిడ్డ తనను బాధపెట్టుచున్న;
మాతృమూర్తి 'క్షమ'కు మారుపేరౌ గదా!
వందనమ్ము లమ్మ లందరికిని!
(క్షమ=భూమి,ఓర్పు)

భర్త కన్నుమూయ,వయసులో నుండియు,
స్వసుఖములు త్యజించి,సంతు బెంచు
కొనుచు ఒంటరిగనె మను తల్లు లెందరో!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఉండు గృహిణి కన్న ఉద్యోగినులకు
బాధ్యతలు హెచ్చు, మాతృధర్మ నిర్వ
హణమునందు వారు వెనుకంజ వేయరు;
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లులైన పిదప,పిల్లల కొరకు,ఉ
ద్యోగముల త్యజించుచున్న మహిళ
లుందు రందునందు,వందనీయలు వారు!
వందనమ్ము లమ్మ లందరికిని!

కడుపునందు నిసుగు కాలితో తన్నిన,
పుట్టి బాధ లెన్ని పెట్టుచున్న,
కన్నతల్లి వాని మన్నించునే గదా!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ చూపులందు అమృతమ్ము తొలకును,
అమ్మ పలుకులందు అమృత మొలుకు,
అమ్మ చేతలందు అమృతమ్ము జాల్వారు,
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ పదమునందు కమ్మదన మ్ముండె,
కన్నకడుపు తీపి నెన్న తరమె?
అంద రమ్మ లిటులె ఉందురు లోకాన,
వందనమ్ము లమ్మ లందరికిని!

భువిని జన్మ నిచ్చు నవ మాస ములు మోసి,
స్తన్యమిచ్చి సాకు శైశవమున,
మమత బెంపు సేయు మలమూత్రముల నెత్తి,
వందనమ్ము లమ్మ లందరికిని!

ఉగ్గుపాలు పోసి ఉయ్యాల నూపును,
చిచ్చికొట్టి నిదురపుచ్చు నమ్మ,
దిష్టిచుక్క దిద్ది దీవెన లందించు,
వందనమ్ము లమ్మ లందరికిని!

గోరుముద్ద లిడుచు గారాము చేయును,
చందమామ జూపి శాంతపరచు,
చంకనెత్తి తిప్పి సరదాలు తీర్చును,
వందనమ్ము లమ్మ లందరికిని!

ముద్దుమాట లెన్నొ ఒద్దికగా జెప్పు,
నిలువబెట్టి నడక నేర్పు నమ్మ,
ఆక లెరిగి వేళ కన్నము తినిపించు,
వందనమ్ము లమ్మ లందరికిని!

చిట్టి పొట్టి కతలు చెప్పి మెప్పించును,
ఆట పాట నేర్పి అలరజేయు,
ఒడిని బడిగ జేసి ఓనమాల్ దిద్దించు,
వందనమ్ము లమ్మ లందరికిని!

ఏటి కొక్క మాటు పాటించి 'మాతృ ది
నోత్సవమ్ము',మిన్నకుండ దగున?
అమ్మ నిత్యపూజ కర్హురా లగుగదా!
వందనమ్ము లమ్మ లందరికిని!

గుండె గుడిగ జేసి,నిండారు భక్తితో
'నిత్య మాతృపూజ' నెరప వలయు;
తల్లి మించునట్టి దైవత ముండునా?
వందనమ్ము లమ్మ లందరికిని!

ఒక్క పద్యమందు ఒడికమ్ముగా పది
మాటు 'లమ్మ' యన్న మాట వాడె
భాగవతములోన బమ్మెర పోతన్న!
వందనమ్ము లమ్మ లందరికిని!
(ఒడికము=మనోజ్ఞము,యుక్తము; 'అమ్మల గన్న యమ్మ....'అనే పద్యంలో పోతన్నగారు 'అమ్మ'శబ్దాన్ని పది సారులు ప్రయోగించారు!)

గొప్ప పేరు తెచ్చుకొనెను గోర్కీ 'అమ్మ',
అది ప్రశస్త నవల; అనువదింప
బడె ప్రపంచ ముఖ్యభాష లన్నింటను!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మపైన వ్రాసినట్టి పాటలు, కవి
తలును,కావ్యములును గలవు పెక్కు;
శతకములును గలవు,సంకలనము లుండె!
వందనమ్ము లమ్మ లందరికిని!

కలము బట్టినట్టి కవివాచ్య దెవ డైన
అమ్మ గూర్చి వ్రాయు నంతొ యింతొ;
అట్లు వ్రాయకున్న అది వింతలకు వింత!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మగూర్చి కవన మనగానె భావాలు
కదలి తరగ లట్లు క్రందుకొనును;
భావములకు తగిన పదపుష్టి సమకూరు!
వందనమ్ము లమ్మ లందరికిని!

కొన్ని విషయములను కూతుళ్లు తల్లికే
చెప్పగలరు మనసు విప్పి, తల్లి
కడుపులో నిడుకొని కాచు కూతుళ్లను!
వందనమ్ము లమ్మ లందరికిని!

తాను గాఢనిద్రలో నున్న ఆ తల్లి
బిడ్డ యేడ్పు చెవిని బడ్డయంత
తట్టి పిలిచినట్టు తటుకున మేల్కాంచు!
వందనమ్ము లమ్మ లందరికిని!
(తటుకున=వెంటనే)

పాలుతాగు నెలల పసికందు గుర్తించు
అమ్మ మేని స్పర్శ, అమ్మ మోము,
అమ్మ మాట, అమ్మ అడుగుల సవ్వడి!
వందనమ్ము లమ్మ లందరికిని!

నిదురపోవుచున్న నిసుగు గుర్తించును
తల్లి కదలికలను; తనను వదలి
అమ్మ పక్క కరుగ అసహనమును జూపు!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ ఒడిని బిడ్డ హాయి ననుభవించు,
అమ్మ బిడ్డ జూచి హాయి పొందు;
అమ్మతోడ బిడ్డ అనుబంధ మట్టిది!
వందనమ్ము లమ్మ లందరికిని!

తండ్రి పేరె తరచు దరఖాస్తుపై వ్రాయు
సంప్రదాయ మొకటి సాగుచుండె;
తల్లి పేరు కెపుడు దక్కు నా మర్యాద?
వందనమ్ము లమ్మ లందరికిని!

బాల్యమందె దేశభక్తి బిడ్డల కుగ్గు
పాల రంగరించి పట్టినట్టి
వీరమాత లున్న భారతావని యిద్ది!
వందనమ్ము లమ్మ లందరికిని!

కన్నబిడ్డలందు ఉన్నత భావాలు
నాటుకొనగ చిన్ననాటినుండె
నీతి కథలు చెప్పు మాత లెందరొ కదా!
వందనమ్ము లమ్మ లందరికిని!

ముద్దుచేయ గలదు,బుజ్జగించ గలదు,
మందలించ గలదు మాతృమూర్తి;
కన్నబిడ్డ మంచి కాంక్షించియే అవ్వి!
వందనమ్ము లమ్మ లందరికిని!

బిడ్డ నోట గాంచి 'విశ్వరూపము' నాడు
విస్తుపోయె నొక్క పిచ్చితల్లి;
తల్లిప్రేమ పిచ్చితనముగా కనిపించు!
వందనమ్ము లమ్మ లందరికిని!

కలవు మన పురాణములలోన పెక్కులు
మాతృ ఘనత చాటు మహిత కథలు;
దైవతములు,కవులు తల్లి బిడ్డలెకదా!
వందనమ్ము లమ్మ లందరికిని!

శ్రుతులు చెప్పె, చెప్పె స్మృతులు, పురాణేతి
హాస కావ్య ప్రభృతు లమ్మ ఘనత;
మతము లెల్ల మాతృమహిమను కొనియాడె!
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లి ప్రతి గృహమున దైవప్రతినిధిగ
వెలయు ననెడి మేలి పలుకు వినుట
కలదు,నాస్తికులును కాదన రీ మాట!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ కన్న నితరు లాత్మీయు లగుదురా?
అమ్మ ప్రేమ సాటి అవని గలదె?
అమ్మ చేతిస్పర్శ ఆశ్వాస మొసగదా?
వందనమ్ము లమ్మ లందరికిని!

స్త్రీలలోన అమ్మదే తొలి స్థాన,మా
స్థాయి కొరులు చేర సాధ్యమా?గృ
హాలయమున'అమ్మ'మూలవిరాట్టగు!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఉంగ ఉంగ యనుచు ఉయ్యేలతొట్టిలో
ఊసులాడుచుండు 'బోసిబాబు'
తల్లి గొంతు విన్న తలతిప్పి పరికించు!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఆకలైన బిడ్డ 'అమ్మా' అనును గాని,
తాను పిలుచునా ఇతరుల నొకరి?
అమ్మ కడుపు చూచు, నాకలి తీర్చును!
వందనమ్ము లమ్మ లందరికిని!

చూడబడుదురు కడు చులుకన భావాన
తల్లి లేనియట్టి పిల్ల లెపుడు;
వారి జూచి జాలిపడుచుందు రెందరో!
వందనమ్ము లమ్మ లందరికిని!

బిడ్డ కడుపు నిండి 'బ్రేవ్'మని త్రేన్చిన
అమ్మ పొందు తృప్తి కవధి యున్నె?
సంతు శ్రేయ మొకటె సర్వస్వ మమ్మకు!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఆక లెరిగి అమ్మ అన్నము తినిపించు,
నెల్ల అవసరముల నెరిగి తీర్చు,
అలిగెనేని ఓర్పుగలిగి లాలించును,
వందనమ్ము లమ్మ లందరికిని!

వచ్చి రాని 'తొక్కు పలుకులు' బిడ్డాడ,
చిలుక పలుకు లట్లు తలచి మురిసి,
వినును కన్నతల్లి వీనుల విందుగా!
వందనమ్ము లమ్మ లందరికిని!

కన్నతల్లి మోము కన్న ప్రసన్నమౌ
మోము నెందు కానబోము పుడమి;
కరుణ రసము నమ్మ కన్నులు కురిపించు!
వందనమ్ము లమ్మ లందరికిని!

సాంప్రదాయికములు షడ్రుచు లుండెను,
కలవు మరియు భేదములును గాని,
సాటికావు తల్లి చనుబాల రుచి కవ్వి!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమృత మెవ్వ డెరుగు? నమ్మ స్తన్యమె నవ
జాత శిశువు కమృత సదృశ మగును;
ప్రాణశక్తి తల్లిపాల స్వధర్మము!
వందనమ్ము లమ్మ లందరికిని!

కడుపులోన బిడ్డ పడినది మెదలు జా
గ్రత్త బూను నమ్మ, ప్రతి నిమిషము
కలుగబోవు బిడ్డకై ప్రతీక్షించును!
వందనమ్ము లమ్మ లందరికిని!

తనకు కష్టమైన,తన గర్భమందున్న
పుట్టబోవు బిడ్డ 'పుష్టి' కొరకు
కఠిన నియమములను కాదనబో దమ్మ!
వందనమ్ము లమ్మ లందరికిని!

భర్త కన్న, బిడ్డపై నెక్కువగ కాన
వచ్చు ప్రేమ స్త్రీల వర్తనమున;
అందువలన నేమొ అమ్మ దైవ మనుట!
వందనమ్ము లమ్మ లందరికిని!

కాకిపిల్ల ముద్దు కాకికి అనునట్టు,
లెవరి బిడ్డ వారి కింపు గూర్చు;
తల్లి యెంచబోదు తన బిడ్డ లోపాల!
వందనమ్ము లమ్మ లందరికిని!

గుడ్డి-మూగ-చెవుడు-కుంటి-ఇత్యాది వై
కల్యములను బిడ్డ కలిగియున్న,
బిడ్డ పట్ల తల్లిప్రేమ తగ్గదు, హెచ్చు!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఇతరు లెవ్వరైన నెత్తిచూపిన తన
బిడ్డ లోపములను, విని సహించ
జాల 'దమ్మ మనసు',చాల దుఃఖించును!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మపైన బిడ్డ లలుగుదు రపు డపు,
డలుక తీర్చుచుండు నమ్మ గూడ;
అమ్మ బుజ్జగింపు లలరించు బిడ్డల!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఒట్టు పెట్టుకొనెడు పట్టులందున కొంద
'రమ్మతోడు,నమ్ము!' డనుట యుండె;
అమ్మపైని గౌరవ మ్మిది సూచించు!
వందనమ్ము లమ్మ లందరికిని!

విలుచుకొనగ అమ్మ విపణి వస్తువు కాదు,
మట్టిబొమ్మ కాదు మలచుకొనగ;
అమ్మ ప్రేమమూర్తి,అతుల దయాస్ఫూర్తి;
వందనమ్ము లమ్మ లందరికిని!

పెద్దవయసులోన వృద్ధాశ్రమమునందు
ఉండదగున బిడ్డలున్న తల్లి?
సంతు కుండవలయు సదసద్వివేకమ్ము!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఆలి మెప్పు కొరకు అమ్మను నొప్పించు
పురుషు డెట్లు సుఖము పొందగలడు?
చిత్తశాంతి లేక చింతించు బతు కెల్ల!
వందనమ్ము లమ్మ లందరికిని!

వృద్ధమాత జూచి విసుగుకొనుట కాదు,
శక్తి కొలది సేవ సలుపవలయు;
అమ్మ ఋణము తీరునా యెంత చేసిన?
వందనమ్ము లమ్మ లందరికిని!

బ్రతికి యుండినపుడు పరిపరి బాధించి,
శ్రాద్ధకర్మ లేల చచ్చినాక?
అమ్మ ఋణము తీరునా యిట్టి చేష్టల?
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ ఋణము తీరునట్టిది కాదు, లో
కమున లెక్కగట్ట గలరె దాని?
తీర్చు టెట్లు లెక్క తేలని ఋణమును?
వందనమ్ము లమ్మ లందరికిని!

పెద్ద వయసునందు బిడ్డ 'లమ్మా' యని
పిలువ సంతసించ గలదు తల్లి;
ఇంతమాత్ర మెరుగ రేలనో కొందరు?
వందనమ్ము లమ్మ లందరికిని!

బిడ్డలున్న తల్లి పెద్ద వయసున వృ
ద్ధాశ్రమమున కేల నరుగుచుండె?
సిగ్గుచేటు కాద? చింతించవలె ప్రజ!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ పేరనున్న ఆస్తి అపహరించి,
గెంటివైచి ఆమె నింటినుండి,
కులుకుచుండునట్టి కొడుకు క్షమార్హుడా?
వందనమ్ము లమ్మ లందరికిని!

కనికరమ్ము వీడి,పనిమనిషిగ జేసి
వృద్ధమాత నేడిపించు కొడుకు
కాడు కొడుకు,వాడు కర్కోటకుడు గాని,
వందనమ్ము లమ్మ లందరికిని!

వృద్ధమాత లేల వీథుల బడి బిచ్చ
మెత్తుకొందు రనిన,నేది బదులు?
దృష్టి పెట్టవలయు దీనిపై 'పెద్దలు'!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ కడుపు 'కింత' అన్నము పెట్టుచు,
చెప్పుకొనగ నేల గొప్పచేసి?
బాధ్యత యగు తల్లి పట్ల పిల్లల కది!
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ పోషణార్థ మన్నదమ్ముల మధ్య
తరచు పంపకాల తంతు లేల?
పట్టె దన్నమునకె పంపకాలా? సిగ్గు!
వందనమ్ము లమ్మ లందరికిని!

తప్పు చేసినట్లు తల దించుకొని, మూల
నొదిగి ముసలి తల్లి ఉండవలెన?
కన్నతల్లి పైన కఠినంపు టాంక్షలా?
వందనమ్ము లమ్మ లందరికిని!

సమ్మతింపజాల రమ్మ పెద్దరికము
ముఖ్య సన్నివేశములను, కొంత
మంది బిడ్డ,లిది సమంజస మెట్లౌను?
వందనమ్ము లమ్మ లందరికిని!

స్థాయిలోన తల్లి తమకు చాలని దని,
పరుల యెదుట నామె పనిమనిషిగ
నిలుపగల నికృష్ట నీచ సంతతి యుండు!
వందనమ్ము లమ్మ లందరికిని!

మరణశయ్యనున్న, మాటాడలేకున్న,
సంతు కొరకు తల్లి చింతసేయు;
తాను చింతపడదు తన జీవితము గూర్చి!
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లి గుండెకాయ తహతహ పడుచుండు
సంతు మేలుగోరి సంతతమ్ము;
అంతకన్న ఆమె ఆశించునది లేదు!
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లి సంతస మగు చల్లని దీవెన,
తల్లి దుఃఖపడిన తగులు నుసురు!
ఉచిత మెరిగి నడుచు టొప్పు బిడ్డల కెప్డు!
వందనమ్ము లమ్మ లందరికిని!
(ఉసురు=పాపఫలితం)

కన్నతల్లి పేరు కట్టిన ఇంటికి
పెట్టి తృప్తి పొందు బిడ్డ లుందు;
రిట్టి దాఖలాల నెన్నైన గనవచ్చు!
వందనమ్ము లమ్మ లందరికిని!

తల్లి కన్నుమూయ,తనయ కా పేరిడి,
పిలుచుకొనెడివారు గలరు, దాన
కనుల ముందు తల్లి కదలాడి నట్లుండు!
వందనమ్ము లమ్మ లందరికిని!

ఇటులె వ్రాయవచ్చు నెన్నేని పద్యము
లమ్మగూర్చి కనుక,నైన, శతక
మగుట దీని నింక ఆపక తప్పదు!
వందనమ్ము లమ్మ లందరికిని!

శక్తికొలది 'అమ్మ శతకము'పూరించి
తృప్తి పొందినాడ; నింక నేను
సెలవు తీసుకొందు చివరి సారిగ చెప్పి
వందనమ్ము లమ్మ లందరికిని!

అమ్మ పేర చెప్పినట్టి ఈ శతకమ్ము
అమ్మ లందరికిని అంకితముగ
నిండు భక్తితోడ నేను సమర్పింతు;
వందనమ్ము లమ్మ లందరికిని!

## ఆదివాసీలకు అమ్మ

ఆమె ఆదివాసీలకు అమ్మ
ఆమె పరిచయమే అక్కరలేని అమ్మ
అతి సామాన్యమైన జీవితం
అసామాన్యమైన వ్యక్తిత్వం.
వందేమాతరమే అన్న
వంగభూతలమే మిన్న
అనే మాట కు అక్షరరూపం
వంగ భూమాత సిగలో
విరిసిన శ్వేత గులాబి
ఈ మాహాశ్వేత.
పొసగని వివాహబంధాన్ని దాటి
ఇమడలేక ,ముక్కలైన మనసును దాటి
తనకంటూ స్థలం లేని అనుబంధాన్ని దాటి
ధైర్యం గా బైటకు నడిచి
తానేంటో ప్రపంచానికి
నిరూపించిన వీరవనిత
ఈ మహాశ్వేత.
ఆదీవాసీల హక్కులకోసం
కార్మిక సోదరుల హక్కులకోసం
గళమెత్తిన కమ్యూనిస్టు
అణగారిన ఆడవాళ్ళను సమర్థించిన
హ్యూమనిస్ట్ మన మహాశ్వేత.
ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి
హృదయమున్న ధీశాలి
అణగారిన వర్గాలకు అండ
ఆమె అపూర్వ రచనలు
ఆమె వ్యక్తిత్వానికి పెట్టనికోటలు.
ఆమెకు ఎన్నో అవార్డులు
ఆమెకు ఎన్నో రివార్డులు
నిరాడంబరమైన జీవితం
సమాజానికో సందేశం
మనసు విరిగినా
విరాగిగా మారినా
పరులకోసం జీవించు
పరులకోసమే మరణించు
అందులో నే ఉంది అర్థం
జీవిత పరమార్థం



-అరుణ డేనియల్
9000606889

## అక్షర పూదోటమాలి

అక్షరాల పూదోటకు
అతన్ని మాలిగా నియమించబడినదే మొదలు
పుస్తకాలలోని తేనేను
నిత్యం శిష్యునిచేత
తాగించే పనిలో నిమగ్నమౌతాడు.
అతన్ని
విశ్వచైతన్యానికి పాదులు తీయాలని
పురమాయించిందే అదను
విజ్ఞానాన్ని చేదుకోవడానికి
నిత్య విద్యార్థియై పరిశ్రమిస్తాడు
చీకటిలోకాన్ని పోలిన నల్లబల్ల మీద
చిన్ని సుద్దముక్కలా అవతరించి
రాత్రింబవళ్లు.
వెలుగునిచ్చే సూరీడుగా మారిపోతాడు
తెల్లకాగితంలాంటి పిల్లవాడిని
తన చేతిలో పెడితే
అందమైన రంగుల లోకాన్ని
అతని మనోఫలకం మీద ఆవిష్కరించడానికి
అహర్నిశలూ పరితపిస్తాడు విద్యార్థి
భవిష్యత్తు మాగాణంలో
బంగారు పూలు విరభూయించడానికి
విశ్వప్రయత్నం చేస్తాడు
సఫల మనోరథుడై
అతని తల్లితండ్రుల కళ్ళల్లో
సంతోష తరంగాల సవ్వడులు సృష్టిస్తాడు.
లోకాలన్నింటిలో
తల్లిదండ్రుల తర్వాత సమున్నత స్థానం
ఎవరికివ్వాలనే ఆలోచన
తలెత్తినపుడు
ఏకాభిప్రాయం వెలిబుచ్చిన
ఏకైక మూర్తిమత్వం గురువుదే!
నీకు
లోకనీతిని తెల్పి
లోపాలు సవరించినా
బ్రతుకు గీతిని నేర్పి
మెతుకు మీద నీ పేరు రాయించినా
నీ నుండి గురువు కోరే దక్షిణ ఒక్కటే
ఎప్పుడు ఎక్కడ ఎలా కనిపించినా
నువ్వు నమస్కరించాలనుకుంటాడు
అంతటితో ఊరుకోకుండా
సంతుష్టుడై మనస్పూర్తిగా
నిన్ను ఆశీర్వదించ పూనుకుంటాడు.
గురువంటే
చిమ్మచీకటిలో చిక్కుకున్న శిష్యునికి
దీపమై దిక్కు చూపేవాడు
గురువంటే
ఓటమి అంచులో కూరుకుపోయిన
ఛాత్రున్ని ఒక్కసారిగా గెలుపు
ముంగిట
నిలుపగలిగేవాడు
అందుకే కాబోలు....
అతడు అమ్మ ఒడికి
దేవుని గుడికి
అనుసంధానమైన బడిని
ఏలడానికి సృష్టించబడ్డాడు



-కమలేశ్
9160396596

## నాయకుడంటే ..?

గొడవలకు దూరంగా
జనాలకు దగ్గరగా
ఆదరణ కి అర్ధంలా
కష్టాలు తీర్చటానికి ఆలంబనగా
సుఖాలు పరవటంలో ముందంజలో
సమస్యలను పరిష్కరించడంలో ప్రథముడిగా
నిస్వార్థంగా నడిపించేవాడు
ప్రజల మన్ననల్ని చూరగొనేవాడు
అతనే ..అతనే
అసలు సిసలైన నాయకుడు



-యలమర్తి అనూరాధ
9247260206

